కనురెప్పలా కాపాడి.. ప్రాణం తీశావెందుకమ్మా!

● కూతురిని నడుముకు కట్టుకొని బావిలో దూకిన తల్లి ● ఇద్దరి మృతితో లింగాపూర్‌లో విషాదం

అమ్మా!.. ఎంత పని చేశావమ్మా..
నాకు చిన్న గాయమైతేనే తల్లడిల్లిపోతావు..
నేను తింటుంటే.. పొలమారితేనే విలవిలలాడతావు..
అలాంటి నువ్వు ఊపిరాడని నీటిలో ఎలా పడేశావమ్మా..
ఎంతో అల్లారుముద్దుగా పెంచావు..
నా భవిష్యత్తు కోసం కలలు కన్నావు..
చక్కగా తయారు చేసి బడికి పంపి సంబరపడ్డావు
తమ్ముడితో కలిసి ఆడుకుంటుంటే మురిసిపోయావు
క్షణికావేశంలో నా భవిష్యత్తు.. నీ కలలు గుర్తుకు రాలేదా..
నిండునూరేళ్లు జీవించమని దీవించే నువ్వే జీవితాన్ని ముగించావు.
మనమిద్దరం కనిపించక తమ్ముడు గుక్కపట్టి ఏడుస్తున్నాడమ్మా..
ఇంత కఠిన నిర్ణయం ఎందుకు తీసుకున్నావమ్మా..

దండేపల్లి మండలం లింగాపూర్‌లో తల్లి రజిత కూతురిని నడుముకు కట్టుకొని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. చిన్నారి అక్షిత ఆవేదనకు అక్షర రూపమిది.


పిల్లలు అక్షిత, మహేందర్‌లతో తల్లి రజిత(పాత చిత్రం)

- న్యూస్‌టుడే, దండేపల్లి గ్రామీణం

వివరాలు ప్రధాన సంచికలో



ప్రయాణ ప్రాంగణం కిటకిట

రాఖీ పౌర్ణమి వేడుకలు ముగియడంతో మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. సరిపడా బస్సులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆదివారం మంచిర్యాల నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు బస్టాండ్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నా రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. - చిత్రం, న్యూస్‌టుడే మంచిర్యాల

అక్రమాలకు అడ్డుకట్ట.. పారదర్శకతకు పెద్ద పీట

● పొదుపు సంఘాల లావాదేవీలపై సామాజిక తనిఖీ ● పైలట్ ప్రాజెక్టుగా హాజీపూర్‌లో పూర్తి

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం

మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక కార్యకలాపాల్లో చోటుచేసుకుంటున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు జవాబుదారీతనం నింపేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. వీబీజీ రాంజీ తరహాలో సంఘాల ఆర్థిక లావాదేవీలపై సామాజిక తనిఖీ చేపట్టేందుకు నిర్ణయించింది. రాష్ట్రంలోని అయిదు జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సామాజిక తనిఖీ చేపట్టింది. జిల్లాలోని హాజీపూర్ మండలం దొనబండలో రెండు వీవోల్లో సామాజిక తనిఖీని పూర్తి చేశారు. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల్లో చేపట్టేందుకు సమాయత్తమవుతున్నారు.


చెన్నూరు మండలం కిష్టంపేటలో సమావేశమైన స్వయం సహాయక సంఘు సభ్యులు

జిల్లాలో స్వయం సహాయక సంఘాల వివరాలు

- మండలాలు : 16
- గ్రామైక్య సంఘాలు : 459
- స్వయం సహాయక సంఘాలు : 10,952
- సభ్యులు : 1,12,017

మచ్చుకు కొన్ని..

● జిల్లాలోని ఓ మండలంలో స్వయం సహాయక సంఘాలకు రుణ మంజూరులో ఓ ఉద్యోగి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సభ్యుల అవసరాలను ఆసరాగా చేసుకొని వసూళ్లకు పాల్పడుతున్నా.. వెలుగులోకి రావడం లేదు. సామాజిక తనిఖీ నిర్వహించడం ద్వారా అక్రమ వసూళ్ల వ్యవహారం బయటపడుతోంది.

● జైపూర్ మండలంలోని కుందారం గ్రామానికి స్వయం సహాయక సంఘంలో రూ.38లక్షలకు పైగా అక్రమాలు జరిగాయి. గతంలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని, విచారణ చేపట్టాలని ఈ నెల 25న ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఏటా రూ. కోట్లలో రుణాలు..

జిల్లాలోని పొదుపు సంఘాల సభ్యులు ఏటా రూ.కోట్లలో రుణాలను తీసుకుంటున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి వంటివే కాకుండా ప్రతినెలా పొదుపు చేసుకుంటున్నారు. మండల సమాఖ్యల ద్వారా రుణాలను పొందుతున్నారు. జిల్లాలోని మహిళా సమాఖ్యలు ప్రభుత్వ సాయంతో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చారు. బ్యాంకు లింకేజీతోపాటు స్త్రీనిధి ద్వారా పొందిన రుణాలను సభ్యులు తిరిగి చెల్లింపులు సక్రమంగా చెల్లించడం లేదు. కొన్ని సంఘాలు రూ.లక్షల్లో పక్కదారి పట్టగా.. పలు ఘటనలు వెలుగులోకి వచ్చిన సందర్భాలున్నాయి. సంఘాలు తీసుకున్న రుణాలు, వాయిదాల చెల్లింపులపై సెర్ప్ సిబ్బంది అంతర్గతంగా ఆడిటింగ్ నిర్వహిస్తున్నా.. అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు.. ఈ నేపథ్యంలో వీబీజీ రాంజీ తరహాలోనే సంఘాల ఆర్థిక లావాదేవీలపై సామాజిక తనిఖీ చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంది.

నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చు..

మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడం, తిరిగి చెల్లింపులపై సామాజిక తనిఖీ చేపట్టడం ద్వారా సంఘాల్లో పారదర్శకత పెరుగుతుంది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టే అవకాశం ఉంది. - కిషన్, డీఆర్డీవో మంచిర్యాల

వైద్యుల్లేక.. సేవలందక

● టీవీవీపీ ఆసుపత్రుల నిర్వహణ తీరిది..

న్యూస్‌టుడే, మంచిర్యాల వైద్యవిభాగం

జిల్లాలోని టీవీవీపీ(తెలంగాణ వైద్యవిధాన పరిషత్) ఆసుపత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఉన్న మూడింటిలోనూ పూర్తిస్థాయి సేవలందడం లేదు. ఈ కేంద్రాల్లో అందించే అత్యవసరమైన, ముఖ్యమైన ఆర్థో, గైనకాలజీ, సర్జరీ, పిడియాట్రిక్స్ విభాగాల్లోనూ నామమాత్రంగానే వైద్యం అందుతోంది. భవనాలు ఉన్నచోట వైద్యుల కొరత.. నిపుణులు అధికంగా ఉంటే సదుపాయాలు కరవయ్యాయి. ముఖ్యంగా బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి పరిస్థితి మరీ అధ్వానంగా కనిపిస్తోంది. 100 పడకల కేంద్రంగా గుర్తింపు పొంది సంవత్సరాలు దాటుతున్నా ఇప్పటికీ అందుకు తగ్గట్లుగా సిబ్బందిని కేటాయించడం లేదు. త్వరలో చెన్నూరులోనూ నూతన భవనం అందుబాటులోకి రానుండగా అక్కడ కూడా ఇదే ఇబ్బంది కలగనుంది. లక్షెట్టిపేట ఆసుపత్రి కేవలం జ్వర బాధితుల చికిత్సకే పరిమితమవుతోంది.

బెల్లంపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) 30 పడకల నుంచి వంద పడకలకు పెంచి ఏళ్లు గడుస్తోంది. వీటి సామర్థ్యానికి తగ్గట్లుగా భవనాన్ని నిర్మించినా.. ఏరియా ఆసుపత్రిగా ఉన్నతీకరిస్తున్నట్లు అధికారికంగా ఉత్తర్వులు వచ్చినా వైద్యసిబ్బంది నియామకం జరగడం లేదు. కేవలం 10 మంది వైద్యులతో నెట్టుకొస్తున్నారు. ఇటీవలే నలుగురు వచ్చి రెండంకెలకు చేరింది. మొన్నటి వరకు ఇక్కడ సేవలందించింది ఆరుగురు మాత్రమే.

చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం.. అధికారికంగా ఏరియా ఆసుపత్రిగా గుర్తించినా ప్రస్తుతం 30 పడకల సామర్థ్యం ఉన్న భవనంలోనే కొనసాగుతోంది. వంద పడకల భవనం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. కానీ ఇక్కడ 30 మంది బాధితులకు 20మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఈ కేంద్రంలోని నిపుణులు వంతులవారీగా సేవలందిస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

లక్షెట్టిపేట సామాజిక ఆసుపత్రికి 30 పడకల సామర్థ్యం ఉంది. నూతన భవనం కూడా ఇటీవలే అందుబాటులో వచ్చింది. సాధారణ సేవల నుంచి ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేసేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయి. కానీ సేవలందిస్తుంది మాత్రం ఏడుగురు వైద్యులు. ఒక్కొక్కరిపై అదనపు భారం పడుతుండటంతో ప్రత్యేక వైద్యులు సైతం సాధారణ సేవలకే పరిమితమవుతున్నారు.

ఆరోగ్యకేంద్రం	సీఎస్ఎస్	సీఏఎస్ఎస్	జీడీఎంఓ	ఎంఓ	సిమాంక్
చెన్నూరు(30)	5	10	3	1	1
లక్షెట్టిపేట(30)	0	5	1	1	0
బెల్లంపల్లి(100)	0	7	2	1	0

☛ టీవీవీపీ పరిధిలోని మూడు ఆసుపత్రుల్లో పరిస్థితి ఇది. ఈ సంఖ్యను చూస్తేనే తెలుస్తోంది సంబంధిత కేంద్రాల దుస్థితి. ముఖ్యంగా బెల్లంపల్లి పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

శాశ్వత కమిషనర్ లేక..

టీవీవీపీకి కమిషనర్‌గా ఉన్న అజయ్ కుమార్ ఉద్యోగ విరమణ పొంది నెలలు గడుస్తున్నా ఇప్పటికి మరో శాశ్వత అధికారిని నియమించలేదు. ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తుండటంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరవైంది. కొద్దిరోజుల కిందట చేపట్టిన భర్తీ ప్రక్రియ సైతం నిర్లక్ష్యంగా చేసినట్లు కనిపిస్తోంది. వైద్యులు అవసరమైన బెల్లంపల్లిలో ఖాళీలు ఉన్నట్లుగా కూడా చూపించలేదని తెలిసింది. లక్షెట్టిపేటను ఇదే తీరుతో చూడగా చెన్నూరుకు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. మిగతా రెండు ఆసుపత్రులూ టీవీవీపీలో ఉన్నాయనే విషయం మరిచారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యోగాతో ఆరోగ్యం.. శిక్షణతో ఆనందం 6లో

పక్కాగా.. సాగు లెక్క

● కొనసాగుతున్న పంటల వివరాల నమోదు

న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం, దండేపల్లి

ప్రభుత్వం వద్ద ఉన్న సాగు వివరాలు.. క్షేత్రస్థాయిలో ఉన్న వివరాలకు తేడా ఉండటంతో ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వివరాలు కచ్చితంగా ఉంటేనే పంటను అమ్ముకునేందుకు ఇబ్బంది ఉండదు. ఈ తరుణంలో క్షేత్రస్థాయిలో పంటల నమోదు పక్కాగా ఉండేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్ ద్వారా పంటల నమోదు సర్వే ప్రారంభించింది. జిల్లాలో ఎంత మంది రైతులు ఉన్నారు? ఎవరు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. సర్వే నెంబర్లు ఎన్ని తదితర వివరాలను ఏఈఓలు పొలం వద్దకే వెళ్లి అక్కడే నమోదు చేస్తున్నారు.


వీరు కాసిపేట మండలం కోమటిచేనులో పత్తి సాగు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వాలంటీర్, ఏఈఓ. సాగు ఆధారంగా జిల్లాలో మార్కెటింగ్ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటారు.

వాలంటీర్లతో సర్వే..

గతంలో గ్రామాల్లో పూర్తిగా వ్యవసాయ విస్తరణాధికారులే సర్వే నిర్వహించేవారు. రైతుబీమా, రైతు బంధు, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి తదితర విధులతో పని భారం ఎక్కువగా ఉండటం.. కొన్నిచోట్ల ఏఈఓ పోస్టులు ఖాళీగా ఉండటంతో పంటల నమోదు చేయడం పని భారంగా మారింది. గత యాసంగి సీజన్‌లో గ్రామానికి ఒక వాలంటీర్‌ను నియమించి సర్వే చేశారు. ప్రస్తుత వానాకాలం పంట వివరాలను కూడా ఏఈఓల సహకారంతో వాలంటీర్ల ద్వారా సర్వే చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే యాప్‌లో పంట వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. ఈసారి పంటల సాగు ఆలస్యం కావడంతో ఇప్పుడిప్పుడే సర్వే ప్రారంభించారు. పత్తి, వరి, మొక్కజొన్న, కందితో పాటు ఏ పంటలు సాగు చేసినా వీటి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా..

సాగు లెక్కలు సరిగా లేకపోవడంతో రైతులు కొన్ని సార్లు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే క్షేత్రస్థాయిలో పంట వివరాలను సర్వే చేస్తున్నాం. సాగు ఆలస్యం కావడంతో ఇటీవలే సర్వే ప్రారంభించాం. వాలంటీర్లు, ఏఈఓలకు సర్వేపై పూర్తి అవగాహన కల్పించాం. త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. - సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి, మంచిర్యాల

జిల్లాలో ఇదీ పరిస్థితి.. క్లస్టర్లు : 55 | ఏఈఓలు : 48 | వాలంటీర్లు : 371 | పంట విస్తీర్ణం : 3.60 లక్షల ఎకరాలు | రైతులు : 1.70 లక్షలు

'వంతెన నిర్మాణానికి కేంద్రం సహకరించాలి'


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమారం, న్యూస్‌టుడే : జిల్లా నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానం చేసే జాతీయ రహదారిలో కీలకంగా ఉన్న జోడు వాగుల వంతెన నిర్మాణ పనులను కేంద్రం త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోడేటి రవి ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమంలో భాగంగా ఆదివారం జోడు వాగుల వంతెనపై అరగంట పాటు నాయకులతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో చెన్నూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేశ్ తివారీ, పెద్దింటి శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, లక్ష్మణ్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.





నేటి నుంచి అల్పాహార పథకానికి శ్రీకారం

● కేంద్రీకృత వంటశాల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న స్కూల్ బ్రేక్ ఫాస్ట్ పథకంలో భాగంగా జిల్లాలో ఏర్పాటుచేసిన అధునాతన సెంట్రలైజ్డ్ కిచెన్ నేడు(సోమవారం) ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మెడికల్ గోదాములో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్, సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో నిర్మించిన కేంద్రీకృత వంటశాల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని వంటశాలను ప్రారంభించనున్నారు. ప్రారంభానికి ముందే శనివారం ట్రయల్‌రన్ నిర్వహించి అల్పాహారం తయారీచేసి పలు పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందజేశారు. ఇక్కడి నుంచే మంచిర్యాలతో పాటు పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలో పరిధిలో మొత్తంగా 17 మండలాల్లోని 691 పాఠశాలలకు, 13 జూనియర్ కళాశాలలకు అల్పాహారం సరఫరా చేయనున్నారు.


ట్రయల్‌రన్‌లో భాగంగా అల్పాహారం(ఇడ్లీలు) తయారు చేస్తున్న నిర్వాహకులు


ప్రారంభానికి సిద్ధమైన కేంద్రీకృత వంటశాల

కాసిపేట మండలం దేవాపూర్‌కు చెందిన సంతోష్‌కుమార్ ఇంటి పరిసరాలను శుభ్రం చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంతోష్‌కుమార్ ఉపాధి నిమిత్తం బిహార్ నుంచి దేవాపూర్‌కు వచ్చి కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలున్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

భైంసా మండలం తొండాల గ్రామానికి చెందిన సాయిబు వ్యవసాయ పొలంలో పంటకు పిచికారీ చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వానాకాలం.. సర్పాలతో అప్రమత్తం

న్యూస్‌టుడే, కాసిపేట

వర్షాకాలం పాముల సంచారంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల చోటు చేసుకున్న పాముకాటు మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సరైన రక్షణ చర్యలు తీసుకోని కారణంగానే పాము కాటుకు గురై ప్రాణాలను కోల్పోతున్నారు. పొలాల గట్లు, పంట చేలు, కాలువలు, పొదలు, చెత్తాచెదారం ఉన్న ప్రాంతాలతో పాటు, ఇళ్ల చుట్టుపక్కల కూడా పాముల సంచారం పెరుగుతోంది. వర్షాల కారణంగా పాములు తమ నివాస ప్రాంతాల నుంచి బయటకు వచ్చి పొడి, సురక్షితమైన ప్రదేశాల కోసం సంచరిస్తుంటాయి. దీంతో పాముకాటు ఘటనలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఆలస్యం చేయొద్దు

పాము కాటుకు గురైన వ్యక్తిని వీలైనంత త్వరగా సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, అవసరానికి మించి కదలకుండా చూడాలని చెబుతున్నారు. కాటు వేసిన ప్రాంతాన్ని కోయడం, నోటితో విషాన్ని పీల్చడం, కాల్చడం, మూలికలు లేదా ఇతర పదార్థాలు రాయడం చేయొద్దు. గట్టిగా తాడు కట్టడం వంటి ప్రమాదకరమైన పద్ధతులకు దూరంగా ఉండాలి. పాము కాటు లక్షణాలు కనిపించడం లేదని నిర్లక్ష్యం చేయకూడదు. విషపూరిత పాము కాటు అని అనుమానం ఉన్నప్పుడు వైద్య పరీక్షలు అవసరమైన చికిత్స కోసం వెంటనే ఆసుపత్రికి తరలించారు. సకాలంలో సరైన వైద్యం అందితే ప్రాణాలు కాపాడుకోవచ్చు.

స్థానికంగా అందుబాటులో..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంటాయి. ప్రజలకు సరైన అవగాహన లేక పాముకాటుకు గురైన వెంటనే బాధితుడిని జిల్లా కేంద్రాలకు తరలిస్తున్నారు. ముందస్తుగానే మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు తరలిస్తే ముప్పు నుంచి కాపాడుకునే అవకాశం ఉంటుంది. వీటిపై స్థానిక వైద్యులు ప్రజలకు అవగాహన కల్పిస్తే మంచిదని చెబుతున్నారు.









యోగాతో ఆరోగ్యం.. శిక్షణతో ఆనందం

న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం : వ్యాపారంలో రాణిస్తూ 30 మందికి ఉపాధి కల్పిస్తూ.. నిత్యం పనులతో బిజీగా ఉంటూ.. సమాజం కోసం ఏదైనా చేయాలని తపనతో 61 ఏళ్ల వయసులో విద్యార్థిగా మారి యోగాలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు కొంపెల్లి రమేశ్. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. మానసికంగా ఇబ్బందులు పడే వారికి తన యోగా శిక్షణతో ఉపశమనం కల్పిస్తూ మంచి పేరు సంపాదించుకున్న రమేశ్‌పై ప్రత్యేక కథనం.

● 61 ఏళ్ల వయసులో మాస్టర్ డిగ్రీ

కరోనా సమయంలో ఆసక్తి..

మందమర్రి పాత బస్టాండ్‌కు చెందిన కొంపెల్లి రమేశ్ పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తూ జీవితం గడుపుతున్నారు. కరోనా సమయంలో యోగాపై ఆసక్తి పెంచుకున్నారు. సామాజిక మాధ్యమం ద్వారా యోగా సాధన చేసి యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సైతం పొందారు.

అయిదేళ్లుగా...

యోగా సాధనలో లోతుగా అధ్యయనం చేయడం ప్రారంభించి ఇన్‌స్ట్రక్టర్, మాస్టర్(వైసీబీ), పీడీ డిప్లొమా, బెంగళూరులోని ఎస్ వ్యాస యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. అయిదేళ్లుగా సమయం కేటాయిస్తూ యోగా శిక్షణ ఇస్తున్నారు.

ఉచిత శిబిరం..

అనారోగ్యానికి గురైన 60 మందికి పైగా విశ్రాంత సింగరేణి, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వృద్ధులకు ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని మూడు నెలల కిందట ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం నాలుగు గంటలపాటు వారికి యోగా శిక్షణ ఇస్తున్నారు. అనారోగ్యాల బారిన పడిన వారు సైతం యోగా సాధనతో ఉపశమనం పొంది ఆరోగ్యంగా జీవనం సాగిస్తున్నారు. తన విద్యను ఉచితంగా నేర్పించి పది మంది యోగా టీచర్లను సిద్ధం చేసి ఔదార్యం చాటుకున్నారు.


మందమర్రిలో విశ్రాంత ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న రమేశ్

వంద మంది టీచర్లను సిద్ధం చేయడమే లక్ష్యం..

ఆరేళ్లపాటు నేర్చుకున్న యోగాను ప్రతి ఒక్కరికి నేర్పించేందుకు ఉచిత శిక్షణ ఇస్తున్నాను. వంద మందికి పైగా యోగా శిక్షణ ఇచ్చి టీచర్లుగా తీర్చిదిద్ది వారితో ఉచిత శిక్షణ అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాను.
- కొంపెల్లి రమేశ్, మందమర్రి

అడుగు దూరంలో జూడో క్రీడాకారులు

● అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌కు క్రీడా పాఠశాల విద్యార్థులు


తరుణ్ హర్షవర్ధన్ రూప్సీ సహస్ర రామచరణ్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం : జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలకు చెందిన ఐదుగురు పూర్వ, ప్రస్తుత జూడో క్రీడాకారులు అరుదైన ఘనతను సాధించేందుకు అడుగు దూరంలో ఉన్నారు. అండర్-18 ఎస్‌జీఎఫ్ అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌కు ఎంపికయ్యారు. వారు సెప్టెంబరు 17, 18వ తేదీల్లో ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్, దుండాలోని కమల్‌విహార్ ప్రాంతాల్లో నిర్వహించే అంతర్జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొననున్నారు. ఇందులో వీరు ప్రథమ స్థానాల్లో నిలిస్తే అంతర్జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 3 నుంచి 8 వరకు బ్రెజిల్ దేశంలో జరిగే జిమ్నాసియాడ్ ఈవెంట్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకుంటారు.

ఎంపికైంది వీరే

ఆర్.తరుణ్ (55 కిలోల విభాగం), ఎం.హర్షవర్ధన్ (60 కిలోల విభాగం) ప్రస్తుతం వీరు ఆదిలాబాదులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. డి.రూప్సీ (57 కిలోలు) ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. జి. సహస్ర (48 కిలోలు), డి.రామచరణ్ (73 కిలోలు) వీరు హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

దస్తూరాబాద్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన దస్తూరాబాద్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పెర్కపల్లికి చెందిన ఎంబడి సతీశ్ (27) శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ఇనుప కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ పేర్కొన్నారు.


సతీశ్

వృద్ధుడి మృతదేహం లభ్యం

సోన్, న్యూస్‌టుడే : సోన్ మండలంలోని జాఫ్రాపూర్‌కు చెందిన లోలం చిన్నయ్య(75) అదృశ్యమయ్యాడు. ఆదివారం సోన్ మండలం మాదాపూర్ వద్ద వాగులో ఆయన మృతదేహం లభ్యమైంది. చిన్నయ్య మతిస్థిమితం సరిగా లేనికారణంగా ఈ నెల 22న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మృతదేహం లభ్యం కావడంతో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై దేవన్న వెల్లడించారు.


చిన్నయ్య

పులి దాడిలో దూడ హతం

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : అటవీప్రాంతంలో మేతకు వెళ్లిన లేగ దూడపై పులి దాడి చేసి హతమార్చింది. ప్రాథమిక కథనం మేరకు.. సొనాల మండలం దేవులనాయక్‌తండా, ఫుల్‌సింగ్‌నాయక్‌తండా గ్రామాలకు చెందిన ఆవులను దేవులనాయక్‌తండాకు చెందిన పశువుల కాపరి రాఠోడ్ రవి చించబోరి అటవీ ప్రాంతానికి శనివారం మేతకు తీసుకెళ్లాడు. ఆవులు మేత మేస్తుండగా పులి మందపై దాడి చేసి దూడను నోట కరుచుకుంది. పశువుల కాపరి కేకలు వేయగా పులి పారిపోయింది. అప్పటికే దూడ మృత్యువాత పడటంతో గ్రామస్థులు, అధికారులకు సమాచారాన్ని అందజేశారు. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాప్ కెమెరాలు అమర్చారు. ఫుల్‌సింగ్‌నాయక్‌తండాకు చెందిన ఆడె కిశోర్ అనే వ్యక్తికి చెందిన దూడగా గుర్తించారు.

హుండీ దొంగ అరెస్టు

తానూరు (భైంసా), న్యూస్‌టుడే : తానూరు మండలంలోని మొగిలి గ్రామంలో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం ఠాణాలో ఎస్సై షేక్ జుబేర్ వివరాలు వెల్లడించారు. మొగిలి గ్రామంలోని మహాలక్ష్మి ఆలయంలో ఆగస్టు 27న దొంగతనం జరిగింది. దర్యాప్తు జరిపిన పోలీసులు అనుమానితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. గ్రామానికి చెందిన నిందితుడు లక్ష్మణ్ మద్యానికి అలవాటు పడ్డాడు. తాగడానికి డబ్బులు లేక అర్ధరాత్రి తరువాత ఆలయంలోని హుండీ తలుపును బలంగా లాగి అందులోని రూ.5 వేలు దొంగిలించాడు. ఈ మేరకు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై షేక్ జుబేర్

జిల్లావాసులు.. మారథాన్‌లో మెరిశారు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఏటా రాష్ట్ర రాజధానిలో ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ రన్నర్స్ నిర్వహించే ఎన్ఎండీసీ మారథాన్‌లో ఈ ఏడాది జిల్లా నుంచి పదుల సంఖ్యలో ఔత్సాహికులు భాగస్వాములయ్యారు. మారథాన్, హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల విభాగంలో పాల్గొని నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. గుర్తింపు పత్రాలతో పాటు పతకాలను స్వీకరించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్సైగా పని చేస్తున్న కిరణ్(42.195 కిలో మీటర్లు) మొదటి మారథాన్ పూర్తి చేయగా.. జిల్లాకు చెందిన భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు, ఆయన కూతురు అరుణిమ, ఎడ్ల మహేశ్(నారాయణపేట డీసీఆర్‌బీ డీఎస్పీ), గడిగొప్పుల సతీష్(ఆసిఫాబాద్ జిల్లా ఎస్బీ సీఐ), అనంతుల దినేష్, వుత్తూరి వేణు, గుర్రం నర్సింహారెడ్డి, జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకర్‌రావు(సర్జరీ), స్వరూణ్‌రావు, వెంకట్, ఎడ్ల శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పని చేసిన మహేందర్‌రెడ్డి(డీఎస్పీ), ముత్త రవికుమార్(సీఐ), కటికె రవిప్రసాద్(ఎస్సై) హాఫ్ మారథన్(21.097 కిలోమీటర్లు) పూర్తి చేశారు. పది కిలోమీటర్లను ఎడ్ల శ్రీదేవి, గాజుల కృష్ణకిశోర్, గడ్డం శ్రీనివాస్(న్యాయవాది), రాజు, సత్యనారాయణగౌడ్ పూర్తి చేసి పతకాలను పొందారు.


హాఫ్ మారథాన్ పూర్తిచేసుకున్న జిల్లావాసులతో ఎడ్ల మహేశ్(నారాయణపేట డీఎస్పీ), తదితరులు


తన కూతురు, మిత్రులతో కలిసి పాల్గొన్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రావు


తొలి మారథాన్ పూర్తి చేసిన ఎస్ఐ కిరణ్

పొన్నారి.. కూరగాయలతో సిరి

తాంసి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రానికి దగ్గరలోనే ఆ గ్రామం.. ఆ ఊరిలోకి అడుగుపెట్టగానే కూరగాయల తోటలే స్వాగతం పలుకుతాయి. ఊరంతా వీటిని పండిస్తుండటం విశేషం. ఏ కాలంలోనైనా నిత్య ఆదాయం ఆర్జిస్తున్నారు తాంసి మండలం పొన్నారి గ్రామ రైతులు. అయిదేళ్ల క్రితం వరకు అందరిలాగే ఈ గ్రామ రైతులు పత్తి సాగు చేసేవారు. పెట్టుబడులు పెరగడంతో పాటు కూలీల కొరత, పంట దిగుబడి తగ్గిపోవడం, మార్కెట్‌లో పంటకు సరైన మద్దతు ధర లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారు. చాలా మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మరికొందరు విలువైన ఆస్తులను అమ్ముకోవాల్సి వచ్చింది. దిక్కుతోచని స్థితిలో ఉన్న పొన్నారి రైతులు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలతో స్వల్పకాలంలో చేతికొచ్చే పంటల సాగు వైపు అడుగేశారు. పొలాల్లో కొంత భాగం పత్తి, సోయా, కంది ఇతర పంటలు మిగిలిన దాంట్లో కూరగాయలు పండిస్తున్నారు. ప్రధానంగా టమాటా, గోబీ, వంకాయ, బీరకాయ, పచ్చిమిర్చి, కాకర, చిక్కుడు, బెండ, పాలకూర, మెంతి కూర, కొత్తిమీర, బచ్చలికూర, గోంగూర సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. పండించిన కూరగాయలను ఆదిలాబాద్ రైతుబజార్‌కు, వివిధ గ్రామాల్లో జరిగే సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో సాగు చేసిన రైతులు నాగ్‌పూర్, చంద్రాపూర్ మార్కెట్లకు తీసుకెళ్తున్నారు. చుట్టు పక్కల ఉన్న వ్యాపారాలు ఇక్కడికే నేరుగా వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. వాణిజ్య పంటలను వీడి కూరగాయల సాగుతో పొన్నారి గ్రామస్థులు ఆర్థికంగా ముందుకెళ్తున్నారు. వచ్చిన ఆదాయంతో పిల్లల చదువులకు అధికంగా ఖర్చు చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో చేర్పించి ఉన్నత విద్యను అందిస్తున్నారు. కూరగాయల ద్వారా నిత్య ఆదాయంతో వ్యాపారాలు, ఇతర చోట అధిక వడ్డీకి అప్పులు తీసుకోవడం దాదాపుగా తగ్గిపోయిందని రైతులు అశోక్, రాంరెడ్డి, దేవిదాస్, విలాస్ చెబుతున్నారు.


సుంకిడి ఆదివారం సంతలో కూరగాయలు విక్రయిస్తున్న పొన్నారి రైతులు

● పొన్నారి గ్రామ జనాభా: 3,264 ● ఓటర్లు : 1836 ● రైతులు : 253 ● సాగు భూమి విస్తీర్ణం: 2,37

సీసీఐని పునరుద్ధరించే వరకు ఉద్యమిస్తాం

ఎదులాపురం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని సిమెంటు పరిశ్రమను పునరుద్ధరించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని సీసీఐ సాధన కమిటీ, భారాస నాయకులు చందాల రాజన్న, సయ్యద్ సాజిద్‌ఉద్దీన్‌లు ప్రకటించారు. పరిశ్రమను పునః ప్రారంభించాలన్న డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరిన నేపథ్యంలో ఆదివారం దిమ్మ, పొచ్చర గ్రామస్థులు శిబిరానికి చేరుకొని దీక్షలు కొనసాగించారు. యూనుస్ అక్బానీ, యాసం నర్సింగరావు, ఈశ్వర్‌దాస్, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, దాసరి రమేష్, శ్రీనివాస్, నారాయణరెడ్డి, నర్సయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పొచ్చర, దిమ్మ గ్రామస్థులు

మూగవేదన విని.. ఇందిరమ్మ ఇల్లు కట్టించి

తాంసి, న్యూస్‌టుడే : వారిది నిరుపేద కుటుంబం. భర్త, ఇద్దరు పిల్లలు మూగ వారు. శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లులో ఉంటున్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని తాంసి మండలం పొన్నారికి చెందిన కీర్తి లక్ష్మీ ఆరు నెలల క్రితం కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని కలెక్టర్ రాజర్షిషాను కలిసి విన్నవించింది. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఇటీవల నిర్మాణం పూర్తికావడంతో కలెక్టర్‌ను కలిసి గృహప్రవేశానికి ఆహ్వానించింది. కోరిందే తడవుగా ఆదివారం కలెక్టర్ గృహ ప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. కుటుంబ సభ్యులందరికీ సారె (బట్టలు) పెట్టి అభినందించారు. మూగవారైన లక్ష్మీ భర్త రామన్న, పిల్లలు నవీన్, నందినికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గృహనిర్మాణ శాఖ అధికారులు రెడ్డి శంకర్, రమేష్, నసీర్, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ గణేష్ రాఠోడ్, ఆత్మ ఛైర్మన్ నారాయణ, సర్పంచి భూమన్న, ఉప సర్పంచి రాంరెడ్డి, కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

బాసరలో 558 అక్షరాభ్యాసాలు

బాసర (ముథోల్), న్యూస్‌టుడే : ఆదివారం సెలవుదినంతో పాటు శ్రావణమాసం కలిసి రావడంతో బాసర అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అమ్మవారి బాలాలయం భక్తులతో సందడిగా మారింది. వేకువజామున పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అమ్మవారి దర్శనం కోసం గంట, అక్షరాభ్యాసాల కోసం రెండు గంటల సమయం పట్టింది. అమ్మవారి ఆలయంలో 558 అక్షరాభ్యాసాలు జరిగాయి. అక్షరాభ్యాసాలు, గదులు, ప్రసాదాలు ఇతర సేవల వల్ల ఆలయానికి రూ. 6.09 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయాధికారులు తెలిపారు.


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న వేద పండితుడు

ప్రత్యేక పూజలు

బాసర (ముథోల్) : బాసర అమ్మవారిని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ అశోక్ శంకర్‌రావు చవాన్ దంపతులు ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కుంకుమపూజ, మహాహారతి తదితర పూజలను నిర్వహించారు. ఆలయం తరపున సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి దంపతులు బాసరలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. భాజపా మండల అధ్యక్షుడు సాయినాథ్ పటేల్, సీనియర్ నాయకుడు సతీశ్వర్‌రావు, భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌రావు పటేల్ స్వాగతం పలికి సన్మానించారు. బాసర సీఐ దీపక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఫిర్యాదుల పెట్టె.. చూపాలి పరిష్కార బాట

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను నేరుగా తెలుసుకునేలా పాఠశాలల్లో, కస్తూర్బా, గురుకులాల్లో ప్రభుత్వం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయించింది. బాలికల పట్ల ఉపాధ్యాయుల వెకిలిచేష్టలు, భోజనంలో అమలుకాని మెనూ, మరుగుదొడ్ల నిర్వహణ లోపం, పరిసరాల పరిశుభ్రతలో నిర్లక్ష్యం వంటివి స్వేచ్ఛగా తెలిపేందుకు ఈ పెట్టెలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో ఈ పెట్టెల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోగలిగితే వారి సమస్యల పరిష్కారానికి బాటలు పడే అవకాశముంది. - న్యూస్‌టుడే-కలెక్టరేట్


బాలుర విభాగంలో విజేతగా నిలిచిన హైదరాబాద్ జిల్లా జట్టు


అత్యాపత్య రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా క్రీడాకారులు

ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా.. క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ము కశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోడలే.. పాఠాలు చెబుతాయ్..

బేల, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించిన ప్రీ ప్రైమరీ తరగతులను చిన్నారులకు మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా తరగతి గదుల గోడలపై అక్షరాలు, అంకెలు, రంగులు, పండ్లు, కూరగాయలు, పక్షులు, జంతువులు తదితర చిత్రాలతో ఆకర్షణీయంగా రూపొందించారు. చిన్నారుల తరగతి గదిలోకి అడుగు పెట్టగానే రంగురంగుల బొమ్మలు కనిపించేలా గోడలు తీర్చిదిద్దారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా చిత్రాలు ఏర్పాటు చేయడంతో చూస్తూ.. ఆడుతూ.. నేర్చుకునేలా వాతావరణం ఏర్పడుతోంది. అక్షరాలు, సంఖ్యలను గుర్తించడం మొదలుకొని పండ్లు, కూరగాయలు, జంతువులు, శరీర భాగాలు వంటి అంశాలను పిల్లలు చిత్రాల ద్వారా సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతోంది.


చిన్నారులను ఆకట్టుకునేలా చిత్రాలతో అలంకరించిన బాధి ప్రాథమికోన్నత పాఠశాలలోని ప్రీ ప్రైమరీ తరగతి గది

ఆహ్లాదకర వాతావరణం

చిన్నారుల తొలి విద్యాభ్యాసంలో తరగతి గది వాతావరణం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకు అనుగుణంగా గోడల పై వేసిన రంగురంగుల చిత్రాలు వారిలో ఆసక్తిని పెంచుతున్నాయి. బొమ్మలను చూపిస్తూ ఉపాధ్యాయులు పాఠశాలు బోధిస్తుండటంతో పిల్లలు ఉత్సాహంగా స్పందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ తరగతి గదులు చిన్నారులను ఆకట్టుకునే రంగుల బడులుగా మార్చుతున్నారు.

వెయ్యి మాటలెందుకు.. ఒక చిత్రం చాలదా



ఇక్కడ ఒక లారీ అడవిలో నరికిన చెట్లను తీసుకొని వెళ్తోంది. మరో ట్యాంకరు ఆక్సిజన్ తీసుకొని వస్తోంది. ఆ పక్కన మనుషులు ప్రాణవాయువును పైపుల ద్వారా స్వీకరిస్తున్నారు. మనం అడవికి నష్టం కలిగిస్తే భవిష్యత్తులో మనకే కష్టమని చెప్పే సందేశాత్మక చిత్రం నిర్మల్ అటవీ క్షేత్రం పరిధిలోని 'గండి రామన్న అర్బన్ పార్క్'లో కనిపించింది. అర్థం చేసుకున్న వారికి ఇంతకన్నా వివరంగా చెప్పాల్సిన అవసరం లేదని ఆ నందన వనంలో ఈ బోర్డుకేసి చూసిన వారికి అనిపించక మానదు. - న్యూస్‌టుడే, నిర్మల్ సిటీ

22ఏ భూ దోపిడీపై హైదరాబాద్‌లో మహాదీక్ష

నిర్మల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో 22ఏ (నిషేధిత భూముల జాబితా) ముసుగులో రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతున్న అక్రమాలను నిరసిస్తూ సెప్టెంబరు 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో మహాదీక్ష చేపట్టనున్నామని.. విజయవంతం చేయాలని భాజపా శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దీక్ష సన్నద్ధతపై నిర్మల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాఠోడ్ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మహా దీక్షకు తరలిరావాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో భూబదిలీలు, ఆస్తుల బదలాయింపు పేరుతో సాగుతున్న కుంభకోణాలపై, ప్రభుత్వ అవలంబిస్తున్న మొండివైఖరిని ఎండగట్టేందుకు దీక్ష చేపడుతున్నట్లు వివరించారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులపాలు చేయనున్న 22ఏ భూముల నిబంధనలు ఉపసంహరించుకునే వరకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందన్నారు. సమావేశంలో నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కరిపే విలాస్, అంకం మహేందర్, పుర కౌన్సిలర్లు, సర్పంచులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భాజపా శాసన సభ పక్షనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కలల సౌధం.. కరెంటు తీగలే ఆటంకం

ఇచ్చోడ, న్యూస్‌టుడే: అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగల(పీవీటీజీ) సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాల అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో పీవీటీజీ వర్గాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు విద్యుత్తు తీగలు అడ్డంకిగా మారాయి. స్థలాలపై నుంచి తీగలు వెళ్తుండటంతో 15 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు సమస్య పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


కర్రల సహాయంతో తీగలను పక్కకు లాగి ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్నారిలా..

దుబార్‌పేట్‌లో పీవీటీజీ కుటుంబాలకు పీఎం జన్మన్ పథకం కింద 90 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు, సురక్షిత తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో విద్యుత్తు తీగలు నుంచి వెళ్తుండటంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు లబ్ధిదారులు భయపడుతున్నారు. 15 కుటుంబాలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కొందరు కర్రలు పెట్టి, తీగలను పక్కకు లాగి పనులు సాగిస్తున్నారు.


దుబార్‌పేట్‌లో ఇందిరమ్మ ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్తు తీగలు

విద్యుత్తు తీగల సమస్య పరిష్కారానికి ఇప్పటికే నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని విద్యుత్తు ఏఈ శ్రావణ్ తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మంచిర్యాల : 98663 07290
చెన్నూరు : 80085 73627
బెల్లంపల్లి : 99496 20369
కాసిపేట : 91001 77174

(10 AM TO 1 PM)

? మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ సమీపంలో కల్వర్టు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - తిరుపతి, నెన్నెల

✔ త్వరలో పనులు పూర్తి చేయిస్తాం. - మహేందర్ పీఆర్ ఏఈ నెన్నెల, న్యూస్‌టుడే:

? తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట రోడ్డుపైకి మురుగు నీరు చేరుతుంది. - స్వామి, నెన్నెల

సమాధానం: మురుగు కాలువల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తాం. - సురేశ్, పంచాయతీ కార్యదర్శి, నెన్నెల

? బెల్లంపల్లి పట్టణం తిలక్ గ్రౌండ్‌లోని చిల్డ్రన్ పార్కులో పరికరాలు పని చేయడం లేదు. - తిలక్ అసోసియేషన్ సభ్యులు

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. - తన్నీరు రమేశ్, మున్సిపల్ కమిషనర్. బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

వాస్తు పేరిట కూల్చేశారు

సమీకృత మార్కెట్ వద్ద మరుగుదొడ్ల తీరిది

న్యూస్‌టుడే, చెన్నూరు పట్టణం: నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయి నిరుపయోగంగా మారిన భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చేపట్టిన పనులు ఆగిపోయాయి. వాస్తు సరిగా లేదనే కారణంతో దానిని కూల్చివేస్తున్నారు. తిరిగి మరోచోట కొత్తగా నిర్మిస్తున్నారు. ఇదీ చెన్నూరు పట్టణంలో సమీకృత మార్కెట్ వద్ద చేపట్టిన మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణ పరిస్థితి.

రూ.20 లక్షలతో నిర్మాణం

పట్టణంలోని పాత తహసీల్దారు కార్యాలయం వద్ద గత ప్రభుత్వ హయాంలో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులు అసంపూర్తిగానే మిగిలాయి. భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు పాలకులు చర్యలు చేపట్టారు. భవనం వద్ద స్వచ్ఛ భారత్ మిషన్ పథకంలో రూ.20 లక్షలతో పుర ఎన్నికలకు ముందే నిర్మాణ పనులు చేపట్టారు. పునాదుల వరకు పనులను పూర్తిచేశారు. చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు వాస్తు ప్రకారం లేవని పలువురు పేర్కొనడంతో అర్ధాంతరంగా నిలిపివేశారు. చివరకు స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకు వెనుకాల కొత్తగా నిర్మాణ పనులను చేపట్టారు. అయితే పాత నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్నారు. చేపట్టిన నిర్మాణాన్ని తొలగించడం ద్వారా ప్రజాధనం వృథా అయిందని పలువురు విమర్శిస్తున్నారు.


కూల్చివేసిన పాత నిర్మాణం

ఈ విషయమై మున్సిపల్ ఏఈ వినీత్‌ను వివరణ కోరగా.. కూల్చివేస్తున్న నిర్మాణానికి ఎలాంటి రికార్డు చేయలేదన్నారు. దానికి కేటాయించిన నిధులతోనే కొత్తగా మరో చోట నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధితుడి వైద్యానికి ఎల్‌వోసీ అందజేత

జన్నారం, న్యూస్‌టుడే: మండలంలోని కవ్వాల్‌కు చెందిన దుర్గం లింగారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్ర చికిత్సకు రూ.4 లక్షలు అవసరం కాగా విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బాధితుడి తమ్ముడు రాజశేఖర్‌ను ఉట్నూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. రూ.4 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఆదివారం అందజేశారు.


ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి

వేమనపల్లి: మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో రాత్రివేళల్లో చిన్నపాటి వర్షం కురిసినా, గాలులు వచ్చినా.. గంటల తరబడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులు ఆరోపించారు. మల్లంపేట, నీల్వాయిలలో అంతరాయం ఉంటోందని చెప్పారు.

పేదింటి బిడ్డ వివాహానికి చేయూత

స్పందనకు వందనం

జన్నారం, న్యూస్‌టుడే: పేదింటి ఆడబిడ్డ వివాహానికి చేయూతనందించాలని 'ఈనాడు'లో ఆదివారం "పెళ్లికి మీరే పెద్దలవ్వండి" శీర్షికన కథనం ప్రచురితమైంది. లక్షెట్టిపేట పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి సభ్యులు స్పందించి బియ్యం మానసను లక్షెట్టిపేటకు రావాలని ఆహ్వానించారు. పిన్ని రాణితో కలిసి మానస వెళ్లగా.. వివాహానికి కావాల్సిన వంటపాత్రలు(స్టీలు సామగ్రి) అందించి మానసతల్లిన్ని దాటుకున్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.


మానసకు స్టీలు సామగ్రి అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నూరు మండలంలోని వెంకంపేట గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురిని పట్టుకోగా.. పలువురు పరారయ్యారు. పట్టుకున్న వారి నుంచి రూ.11వేల నగదుతో పాటు కోడిపుంజులు, కత్తులు, చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు.

పెరుగు విషయంలో కొట్లాట

★ ఇద్దరి అరెస్టు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ కాలనీలోని శివాజీ బిర్యానీ సెంటర్‌లో పెరుగు విషయంలో ఇద్దరు వ్యక్తులు మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకొంది. శ్రీరాంపూర్ సీఐ అశోక్ కథనం మేరకు.. స్థానికంగా ఉండే పొన్నాల ప్రశాంత్, పొన్నాల కిషోర్ బిర్యానీ తినేందుకు హోటల్‌కు వెళ్లారు. వారు తింటున్న క్రమంలో పెరుగు కావాలని అక్కడే ఉన్న మను బోతుల ప్రశాంత్‌ని అడిగారు. దానికి అతను హోటల్‌లో పని చేసే వాడిని కాదని నన్ను ఎందుకు అడుగుతున్నారంటూ వారితో వాదనకు దిగాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం చెలరేగింది. ప్రశాంత్, కిషోర్ అతనిపై దాడికి దిగారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు. నిందితుల గత నేరచరిత్ర పరిశీలించి నిబంధనల ప్రకారం వారిపై రౌడీషీట్లు తెరిచినట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

దండేపల్లి, న్యూస్‌టుడే: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సెప్టెంబరు 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలని సంఘ జిల్లా ఇన్‌ఛార్జి లింగంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇందు కోసం ఈ నెల 31న మండల స్థాయిలో నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సమస్యల పరిష్కారం కోసం అంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మండల నాయకులు తగరపు సత్యం, బచ్చల అంజన్న, సుభాష్, రమేశ్, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: భారాస నాయకుడు జక్కం జగన్ తన తండ్రి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ అట్టహాసంగా జరిగింది. ఆదివారం జరిగిన తుది పోరులో విజేతగా నిలిచిన జట్టుతో పాటు రన్నర్స్‌కు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. క్రీడాకారులకు పతకాలు అందించారు.


విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

చిన్న రమేశ్ ఆశయ సాధనకు కృషి

కాసిపేట, న్యూస్‌టుడే: ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం నాయకుడిగా సేవలందించిన రోడ్డ చిన్న రమేశ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు అన్నారు. మండలంలోని దేవాపూర్ నాయకపు గూడెంలో రమేశ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాస్, కనకరాజు, మహేశ్, గణపతి, శ్రీకాంత్, ప్రభాకర్, శంకర్ తదితరులున్నారు.


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



కళావిహీనంగా ప్రకృతివనం

చెన్నూరు మండలంలోని బావ్‌రావుపేట గ్రామంలోని పల్లె ప్రకృతి వనం నిర్వహణ కరవై పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. చెట్లు ఏపుగా పెరగడంతో అందులోకి వెళ్లేందుకు స్థానికులు జంకుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రకృతివనాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే

రహదారిపై గుంత.. వాహనదారులకు చింత

మంచిర్యాల నగరంలోని శ్రీనివాస గార్డెన్స్ సమీపంలో ప్రధాన రహదారిపై అంతర్గత పైప్‌లైన్ కోసం తవ్విన గుంతను పూడ్చి చదును చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది వాహనదారులు ఈ గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యాయి. రోజుకు వేలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతను వెంటనే పూడ్చి బీటీతో శాశ్వత మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే





నిర్లక్ష్యం నీడలో మంచినీటి ట్యాంకు

పాతమంచిర్యాలలోని మంచినీటి ట్యాంక్ ఆవరణ పరిశుభ్రతపై అధికారులు ఆది నుంచి నిర్లక్ష్యమే ప్రదర్శిస్తున్నారు. అక్కడ గతంలో ట్యాంకు చుట్టూ సిమెంట్ ఫ్లోరింగ్ చేశారు. ఇప్పుడు ఆ సిమెంట్ ఫ్లోరింగ్ అక్కడక్కడ ధ్వంసమైంది. ట్యాంకు చుట్టూ గడ్డి పెరిగి, బురదతో నిండి అపరిశుభ్రంగా ఉంది.

- న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

అసంపూర్తి పనులతో ఇక్కట్లు..!

రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి ఆధ్వర్యంలో చేపడుతున్న అసంపూర్తి పనులతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రాజీవ్ చౌక్‌లో పైపులైను లీకేజీ కావడంతో మరమ్మతులు చేపట్టిన సిబ్బంది గుంతను పూడ్చి పైన మట్టిని అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

- రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే



బియ్యం పంపిణీకి నేడే చివరి రోజు

జిల్లాలో 85 శాతం పూర్తి

న్యూస్‌టుడే, ఏసీసీ :

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ ప్రక్రియ నేటితో ముగియనుంది. ఈ నెల 30 నాటికి జిల్లాలో 85 శాతం పంపిణీ పూర్తయింది. వర్షాకాలం నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల కోటాను ఒకేసారి ఆగస్టులో పంపిణీ చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ దుకాణాలకు గోదాము నుంచి బియ్యాన్ని విడతలవారీగా పంపించడం, సరఫరాలో జాప్యం నేపథ్యంలో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయడం, ఒక్కో కార్డుకు 15 నిమిషాల వరకు సమయం పడుతోంది. క్షేత్రస్థాయిలో దుకాణాలకు సకాలంలో చేరకపోవడం ఫలితంగా డీలర్లు, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 1 నుంచి 31 వరకు రేషన్ దుకాణాల్లో బియ్యం అందిస్తామని చెప్పినా దుకాణాల్లో చాలా వరకు నిల్వలు లేకపోవడంతో మూసేఉన్నాయి. బియ్యం కోసం దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడటం దీనికి తోడు టోకెన్లు అందిస్తూ పంపిణీ చేపట్టడంతో మరింత ఇబ్బందులు తలెత్తాయి. సోమవారం పంపిణీకి తుది గడువు ఉన్నా ఆదివారం సాయంత్రం పలు దుకాణాలకు గోదాముల నుంచి లారీల్లో బియ్యం సరఫరా జరిగింది. సోమవారం ఒక్కరోజు మాత్రమే గడువు ఉండటంతో తమకు మూడు నెలల బియ్యం అందుతాయో లేదోనని ఆందోళనకు గురవుతున్నారు. గడువు పెంచాలని అంతా కోరుతున్నారు.


ఆదివారం ఉదయం గోదాము నుంచి ఓ రేషన్ దుకాణానికి లారీలో వచ్చిన బియ్యం

జిల్లాలో ఇలా..
మొత్తం కార్డులు: 2,57,251
బియ్యం తీసుకున్నవారు: 2,21,092
తీసుకోనివారు: 36,154
పంపిణీ పూర్తయిన శాతం: 85.94

జిల్లాలో ఉన్న 423 దుకాణాల్లో మొత్తంగా 30 నుంచి 60శాతం 14 దుకాణాలు, 60 నుంచి 90శాతం 235 దుకాణాలు, 174 దుకాణాల్లో 90 శాతానికిపైగా పంపిణీ జరిగింది.

షీ టీం సేవలపై అవగాహన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, రక్షణపై షీ టీం సిబ్బంది అవగాహన కల్పించారు. ఆదివారం స్థానిక వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వనిత, సతీష్‌లు షీ టీం అందిస్తున్న సేవలను వివరించారు. బాలికలు, మహిళల సంరక్షణే ధ్యేయంగా ఇది పని చేస్తోందని పేర్కొన్నారు. అధ్యాపకులు సరిత, రవళి, ప్రణయ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సిబ్బంది

ఉత్తర్వులు రద్దు చేయాలి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యారంగాన్ని అనాలోచిత నిర్ణయాలతో మరింత సంక్షోభంలోకి నెడుతున్నారని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, జయకృష్ణ ఆరోపించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థుల సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలను బాహ్య మూల్యాంకనం చేయించాలన్న ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మహాసభలను విజయవంతం చేయండి

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) 9వ రాష్ట్ర మహాసభల గోడప్రతులను నాయకులు ఆదివారం పట్టణంలో ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం తిరుపతి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రైతులకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి, వెంకటేష్, రాజన్న, మల్లేశ్, సదానందం, రాజేందర్, చంద్రయ్య పాల్గొన్నారు.


గోడప్రతులను విడుదల చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

జేఏ పరీక్ష నిర్వహించేలా చూడండి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 రాత పరీక్ష నిర్వహించేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావుకు అభ్యర్థులు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

దండేపల్లి, న్యూస్‌టుడే: పంట సాగు కోసం రోజురోజుకు పెట్టుబడి పెరుగుతున్నా దీనికి అనుగుణంగా మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారని, గిట్టుబాటు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్ల ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్ పేర్కొన్నారు. రైతులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సెప్టెంబరు 8, 9 తేదీల్లో మంచిర్యాలలో జరిగే సంఘ రాష్ట్ర మహాసభల గోడప్రతులను ఆదివారం ఇక్కడ విడుదల చేశారు. సంఘం జిల్లా నాయకులు కుశ్నపల్లి కిష్టయ్య, రాజన్న, సత్తన్న, చంటి, బుజ్జన్న, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.


దండేపల్లిలో గోడప్రతులను విడుదల చేస్తున్న సంఘ నాయకులు

అట్టహాసంగా మహిళల క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళల క్రికెట్ ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి 50 మందికి పైగా హాజరై తమ ప్రతిభ చాటారు. బౌలింగ్, బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. హైదరాబాద్ నుంచి క్రికెట్ ఆపరేషన్ కమిటీ సభ్యులు జి.రవికుమార్‌రెడ్డి (హెచ్‌సీఏ చీఫ్ కో-ఆర్డినేటర్), ఎం.రేవతి (సభ్యురాలు) హాజరయ్యారు. వయసులవారీగా సంబంధిత జట్లకు ఎంపిక చేస్తామని, నిత్యం సాధన చేస్తూ ఆటను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కోదాటి ప్రదీప్, మేనేజర్ వేణుమాధవ్, కోచ్ పొరండ్ల ప్రదీప్, సీనియర్ క్రీడాకారులు చందు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన వారితో సెలక్షన్ కమిటీ సభ్యులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

ఏసీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

నెన్నెల, న్యూస్‌టుడే: భారాస నాయకులపై అక్రమంగా కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైసు మిల్లులో అవినీతి జరిగిందని భారాస నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే నాయకులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాగర్ గౌడ్, స్థానిక సర్పంచి ఇబ్రహీం పాల్గొన్నారు

తాళ్లపేటలో ఉచిత వైద్యశిబిరం

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో హెచ్‌ఈఎల్ అనే స్వచ్ఛంద సంస్థ, కార్తికేయన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు ఉచితంగా రక్తహీనత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి కళావతి, ఉప సర్పంచి పుట్టపాక తిరుపతి, వైద్యులు రాధిక కిరణ్, మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, నాయకులు కిషన్, కుమారస్వామి, వెంకటేశ్, దయాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.


తాళ్లపేటలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోటకు చేర్చాలి

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనమంటూ రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించినా ప్రజలకు పూర్తి స్థాయి ప్రయోజనం చేకూరడం లేదని భాజపా ఫ్లోర్ లీడర్ గాజుల ముఖేష్‌గౌడ్ ఆరోపించారు. ఇప్పటికీ శాఖలన్నీ ఒక చోటకు చేర్చలేదని, దీంతో జిల్లావాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆదివారం భాజపా కార్పొరేటర్లు కాస్తూరి నాగరాజు, బొట్ల అనితతో కలిసి ఆయన మాట్లాడారు.

జీపీడీపీలో మంచిర్యాల భేష్

మంచిర్యాల గ్రామీణం: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రణాళిక (జీపీడీపీ)లో భాగంగా చేపట్టిన పనులు, ఇతర అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో మంచిర్యాలకు ప్రథమ స్థానం దక్కిందని జిల్లా ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారి కిషన్ పేర్కొన్నారు.

రూ.లక్షలు వెచ్చించి.. నిరుపయోగంగా మార్చి

న్యూస్‌టుడే, కోటపల్లి :

ప్రజాధనం ఎలా వృథా అవుతుందో చెప్పడానికి నిదర్శనంగా మారింది కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మించిన వైద్యాధికారి నివాస సముదాయం. మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు అత్యవసర సమయంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి భవనం నిర్మించింది. పూర్తయి నాలుగేళ్లయినా ప్రారంభం కాలేదు.

ఆరేళ్ల కిందట డీఎంఎఫ్‌టీ నిధులు రూ.90 లక్షలతో వైద్యాధికారితోపాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మించారు. సిబ్బంది సంబంధిత భవనంలో ఉంటున్నా.. వైద్యాధికారి భవనం మాత్రం నిరుపయోగంగా మారి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. పశువులు సంచరిస్తుండటంతో అపరిశుభ్రంగా కనిపిస్తోంది. భవన కిటికీలు, తలుపులు ఇతర సామగ్రి శిథిలావస్థకు చేరుతున్నాయి.


వృథాగా వైద్యుడి నివాస భవనం

అధికారుల నిర్లక్ష్యం

భవనం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా.. దాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్‌తోపాటు వైద్యశాఖ అధికారులు తరచూ సందర్శనలు చేస్తున్నా ఆసుపత్రి వరకే పరిమితమవుతున్నారు తప్పితే.. భవనం ఉపయోగంలోకి తీసుకురావడంపై దృష్టి సారించలేకపోతున్నారని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వైద్యులు దూరప్రాంతాల నుంచి వస్తుండటం, సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే భవనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ జాతర

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలో పోచమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని మహిళలు అధిక సంఖ్యలో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. వేద పండితుడు పంబాల సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నస్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కార్పొరేటర్ బండారి సుధాకర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు అర్కాల శ్రీనివాస్, మాజీ సర్పంచి జక్కుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని వేలాల గట్టుమల్లన్న స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పట్నాలు వేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

జైపూర్: ఇందారం గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం జోడు నాగుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం కనులపండువగా సాగింది. పండితులు ప్రత్యేక పూజలు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.


బోనాలతో వస్తున్న భక్తులు


పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


జోడు నాగుల దేవతల వద్ద గ్రామస్థులు



దారి ఇలా... గమ్యం చేరేదెలా..

దండేపల్లి మండలం వెల్గనూర్ నుంచి నంబాల వెళ్లే రహదారి శిథిలమై ఏళ్లు గడుస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. రోడ్డు కంకర తేలి గుంతలమయం అయింది. చినుకు పడితే గుంతల్లో నీళ్లు నిండి రోడ్డంతా బురదమయం అవుతోంది. ఇరు గ్రామాల రైతులకు పొలాలు ఇక్కడే ఉండటంతో వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, దండేపల్లి